



"సార్!"

తల ఎత్తి చూశాడు శ్రీధరబాబు.

"అయ్యగోరు ఈ చీటీ మీ కిమ్మన్నారు."

శ్రీధరబాబు చూపులు ఆ వ్యక్తి మీద ఒక క్షణం నిలిచాయి. తడబడుతూ చీటి అందుకున్నాడు.

కంచుగంట మీద ఖంగు ఖంగున ఏడు గంటలు వినిపించాయి. క్లాసులు వదిలి విద్యార్థులు బిలబిలా వచ్చి బోధకులను తప్పుకుంటూ ఇళ్ళకు పరుగెత్తుతున్నారు.

శ్రీధరబాబు నింగిలోకి చూస్తూ నిలబడ్డాడు. పడమటి దిక్కు ఎర్ర చందనం పులుముకుంటూంది. అలా చూస్తూ హాయిగా సాయంత్రమంతా గడపడం అతనికి ఇష్టం. చేతి వేళ్ళ మధ్య అలాగే ఉన్న ఆ చీటీ విప్పి చూడటానికి బుద్ధి పుట్టడం లేదు. ఈ ప్రశాంత సాయంత్రంలో అది నిప్పులు కురుస్తుందేమో? మనసులో సందేహం.

"నమస్తే, మాస్టారూ!" శ్రుతి చక్కగా సవరించిన వీణ తీగమీద మెల్లగా తాకినప్పటి స్వరం.

శ్రీధరబాబు చూపులు అస్తమిస్తున్న సూర్యుని పైనే నిలిచాయి.

"మాస్టారుగారూ!"

"ఓ. . .నువ్వా, జ్యోతీ! ఏమిటి?"

జ్యోతి ముఖం మీద సంధ్య కాంతి పడి చెదిరిపోయింది. బుగ్గలు ఏవో ఎర్రటి తళుకు లీనాయి. "మీతో. . ."

"ఊఁ..."

"మీ కో విషయం చెప్పాలని కొన్నాళ్ళ నుంచి అనుకుంటున్నా. కాని. ధైర్యం చిక్కలేదు. ఇప్పుడు చెప్పాలనుకున్నాను. ఎప్పుడు వీలవుతుంది?" ఒక్కొక్క మాటే అంది.

శ్రీధరబాబుకు ఆశ్చర్యం కలిగింది "నాతోనా? ! ఎందుకూ?" అన్నాడు

"అదేమిటి, మాస్టారూ? చెప్పడానికి ఇంకెవరున్నారు నాకు?" అంతలోనే ఆమె కళ్ళ అంచుల్లో ఓ నీటిచుక్క మెరిసింది

"ఆఁ ఏమిటి, జ్యోతీ? సరేలే. రేపు సాయంత్రం. సరేనా?"

"అలాగేనండి." సడలిన విశ్వాసం చిక్కబట్టుకుంటూ, పుస్తకాలు గుండెకు ఒత్తుకుంటూ మెల్లగా పచ్చిక పడక మీదుగా నడిచి వెళ్ళింది జ్యోతి.

చూపులకు అందినంతదాకా అటే చూస్తూ నిలుచున్నాడు శ్రీధరబాబు. ఆమె మలుపు తిరగగానే అతని చూపుల్లో నలుపు పడింది. చేతిలో చీటీ కొంచెం వణికింది. 'ఇంత అమాయకురాలు ఈ అమ్మాయి. ఈమెను అణువణువునా పొడవాలనుకొని ముక్కులు పదును పెట్టుకుంటున్న కాకులు ఎన్నో. ఏమిటి ఈ లోకం?'

గంగరావిచెట్టు పైన ఓ కీచురాయి స్వరం మార్చకుండా ఒకే రాగం సాగదీస్తూంది.

శ్రీధరబాబు తన కార్యాలయం వైపు నడిచాడు. మొదటి మెట్టు. రెండో మెట్టు. . . ఆగాడు. మూడో మెట్టుమీద కాలి కేదో తగిలింది. చూపు దించాడు. 'చదువు! చదువు!' అన్న మాటలు చూశాడు. వంగి కాగితం చేతికి అందుకున్నాడు.

'జ్యోతిని చూస్తుంటే నీ కళ్ళల్లో జ్యోతులు వెలుగుతున్నాయి కదూ? స్కూల్లో మంటలు రేగుతాయి తెలుసుకో.'

సంతకం లేని ఆ కాగితం మంచిదనం ఎరగని మోటు మనిషిలా వెక్కిరించింది.

శ్రీధరబాబు గుండెలో ఓ చిన్న నిట్టూర్పు. పెదాల పైన జారిన చిన్న శబ్దం. 'ఛీ!' నాలుగు వైపులా చూశాడు. అనుమానించడానికి ఆస్కారం ఏమీ కనిపించలేదు. కాగితం చించి పారేశాడు.

కార్యాలయంలో ఓ మూల ఉన్న సోఫాలో కూచున్నా డతను. జవాను వంక మీట నొక్కాడు.

చేతిలో కదులుతున్న చీటీ చూశాడు దాన్ని విప్పరాదనే భావాన్ని అణిచివేసి మడత తీశాడు.

"శ్రీధరబాబూ!

చాలా రోజులుగా మీకు చెప్పాలనుకుంటున్న విషయం ఇప్పుడు చెప్పక తప్పడం లేదు. వెంటనే మా బంగళాకు రండి.

—చైర్మన్."

ఒక నిమిషం ఆ మాటల వైపే చూశాడు శ్రీధరబాబు. సంధ్యాకాంతి చివరి తళుకు అతని చూపుల్లో జ్వలించింది. వెంటనే చీకటి నీడలు సన్నటి పొగల తెర కప్పాయి.

ఓ క్షణం ఆగి, ఏదీ తనకు పట్టనంత నిర్లిప్తంగా లేచి నిలుచున్నాడు. అడుగు

# ఎస్. ఎల్. నరసింహారావు

వెంట అడుగుతో వరండా దాటి మెట్లు దిగాడు. స్కూలు ఆవరణ అంతా గుబులు గుబులుగా కనిపిస్తూంది. ఒక్కసారి కళ్ళు విప్పుకొని చుట్టూ చూశాడు. రెండంతస్తుల భవనం పాత మట్టంలా వంకరిస్తూ కనిపించింది. శాశ్వతంగా వదిలిపోతున్న వాడులా చెమ్మగిల్లిన కళ్ళతో చూశా డతను.

పాఠశాల బాహ్యద్వారం దాటి ఓ రిక్షా ఎక్కి చైర్మన్ సుందరరావు ఇంటికి పొమ్మన్నాడు.

పరధ్యానంగా అతని మనసున గతం గంగలా కదులుతూంది. ఏదో ఒక ఆరాటంతో మెదడు స్మృతులను నెమరు వేస్తూంది.

• • •

ఆ రోజు. . . పాఠశాల ఆవరణ సర్వం విద్యుద్దీప మాలికలతో వెలుగుతూంది.

'రవీంద్ర కుటీర్'లో రంగస్థలం కళా సరస్వతి మంజీర నాదాలతో పులకించింది.

మొదటి వరస ఆసనాలలో మధ్యగా ఓ అరవై ఏళ్ళ వృద్ధుని పక్కన ఒక యువకుడు కూర్చున్నాడు. పింజ పోసి కట్టిన ధోవతి పైన మల్లెపూవు లాటి లాల్చీతో నిమ్మకు నీరెత్తినట్టు ఉన్నా డతను. ప్రసన్నమైన ముఖంలో కాంతులు చిమ్ముతున్న కళ్ళలో ఆశయాల అంబరాలకు వేస్తున్న నిచ్చెనలు కనిపిస్తున్నాయి.

ఆ రోజు అతని జీవితంలో ఒక మలుపు.

షష్టిపూర్తితోబాటు వీడ్కోలు సన్మానం పొందుతున్న ఆ వృద్ధమూర్తి లేత వయసులోనే తన పదవిని చేపట్టుతున్న ఆ యువకుణ్ణి సాదరంగా చూస్తున్నాడు.


అల్పాహార విందు, ప్రసంగాల పసందు అయిపోగానే కళాప్రదర్శనలు సాగుతున్నాయి.

చివరి కార్యక్రమం శాస్త్రీయ నృత్యం. రంగు రంగుల దీపాల మధ్య మేలి వస్త్రాల్లో చక్కని నేపథ్యంతో రంగస్థలానికి రమ్యత తెస్తున్న ఆ బాలిక మీద అందరి కళ్ళూ నిలిచాయి.

'ఎవ రీమె?' అన్న ప్రశ్న ఆ యువకుని అంతరంగంలో నిలిచింది. ఈ చిన్న కార్యక్రమానికి డబ్బిచ్చి ఎవరినీ పిలుచుకు రారు. ఈమె ఈ స్కూలు విద్యార్థినే అయి ఉండాలి. ఇకపైన తన విద్యార్థినే కావచ్చు.

ఆ యువక హృదయం ఉప్పొంగిపోయింది. ఓ గర్వరేఖ తలచూపింది. తన విద్యార్థుల్లో ఒక్కొక్కరిలో ఒక్కో శక్తి ఉంటుంది. ఒక్కో హృదయం ఒక్కొక సహస్ర దళకమలం. అందులో ఒక్కొక కళాసౌరభం దాగి ఉంటుంది. అజ్ఞాతంగా ఉండే ఆ కళాబీజాలు తాను కనిపెట్టి ప్రోత్సహించి మొలకెత్తించాలి. మొగ్గలాటి వారి ప్రతిభను వికసింపజేసే బాధ్యత తన మీద పడింది.

ఆ క్షణంలో తన మీద పెద్ద బరువు పడ్డట్టు భావించా డతను. సరి వెయ్యి లేత గుండెలను లాలించి పాలించే ప్రధానోపాధ్యాయుడు తను. ఏ పుట్టలో



ప్రాసాదం
ఫోటో— మధుసూదనరావ్ ( హైదరాబాదు )

ఏ పాముందో తను పసికట్టాలి. నాగస్వరం ఊది ఆ పామును ఆడించాలి. దాని పడగ మీద ఉండే మణులు వెలిగేలా చూడాలి. దాని కోరల్లో దాగిన విషం విరిగేలా చేయాలి. ఓహ్, ఎంత పని తనకి!

అందరూ కరతాళధ్వనులు చేస్తుంటే ఆ అమ్మాయి తెరమరుగయింది.

ఆ యువకుడు ఆలోచనల్లోంచి తేరుకున్నాడు.

"శ్రీధర్! ఇలా రండి. మన చిన్న కళాకారులను పలకరించి వద్దాం" అన్నారు వృద్ధులైన హెడ్మాస్టర్.

"అలాగేనండి" అన్నాడతను.

వేషరచన గది వైపు వెళ్ళారు వారు. సంగీతోపాధ్యాయిని బాల నటుల్ని, నృత్యం చేసిన బాలికలను ఒక్కొక్కరినే పరిచయం చేస్తోంది.

శ్రీధరబాబు కళ్ళు ఎక్కడో వెతుకుతున్నాయి. అప్పుడే దుస్తులు మార్చుకుని రంగులు తుడుచుకొని వస్తున్న ఆ అమ్మాయి అతని కంటపడింది. ఆమెను పరిచయం చేసింది ఉపాధ్యాయిని.

"ఈమె జ్యోతి. చివరి నృత్యం చేసింది. సంగీత నృత్యాలు సులువుగా నేర్చుకుంది."

శ్రీధరబాబు చూపులు జ్యోతి మీద పడి వెలిగాయి. ఏదో తృప్తి ఆ చూపుల్లో కనిపిస్తోంది. ఆ అమ్మాయి ఇందాకా రంగు రంగుల దుస్తుల్లో కళ్ళు జిగేలుమనిపించినా ఇప్పటి పేద బట్టల్లోనే అడవి పువ్వులా మరింత సొగసుగా కనిపిస్తోంది.

"ఏమమ్మా! నీకు నృత్యం ఇంకా బాగా నేర్చుకోవాలని ఉందా?" అడిగాడు శ్రీధరబాబు.

"అవునండి." తొణక్కుండా జవాబిచ్చిందామె.

"మీ నాన్న గారేం చేస్తున్నారు?" యాథాలాపంగా అడిగాడతను.


జ్యోతి ముఖంలో వెలుగులు ఆరిపోయాయి. శ్రీధరబాబు చకితుడయ్యాడు.

ఉపాధ్యాయిని తనే కల్పించుకొని జవాబిచ్చింది: "ఈమె హాస్టల్లో ఉంది. మాకు తెలిసినప్పటినుంచీ అంతే. అంటే, ఆమె అక్షరాలు దిద్దుకొన్నది మొదలు ఇప్పటివరకూ హాస్టల్లోనే ఉంటోంది. అంతకు ముందెక్కడుందో మాకు తెలియదు."

"నాకూ తెలియదు ..." ఓ విధమైన నిస్పృహతో అమాయకంగా అంది జ్యోతి.

శ్రీధరబాబు మరేమీ అనలేదు. అర్థమయినట్టు తల ఊపాడు. జాలి కలిగింది 'ఈ లేత గుండెలో ఎంత దిగులు దాగుందో!' నిట్టూర్చాడు అతను.

ఈ నలిగిన బతుకులను ఓదార్చడం కూడా తన బరువు బాధ్యతల్లో ఒకటి కాబోలు అనుకొని, "అప్పుడప్పుడు కనిపిస్తుండమ్మా!" అని ముందుకు సాగాడు.



గీతల్లో సంగీతం — చిత్రం—ఇ. గోపాలరావు (పొన్నెకల్లు)

● ● ●

రిక్షా కుదుపుకి ముందుకు వాలబోయి తమాయించుకున్నాడు శ్రీధరబాబు. ముందుకు పోవాలంటే ప్రతి బాటా గతుకుల బాటే. కుదుపులు తప్పవు. అనుభవం మీద ఈ సత్యం తెలుసుకొన్న అతను రోడ్డు వేసిన వారి గోత్రాలు వెదకలేదు.

వేయి మంది నవ్వుల పువ్వుల బాల బాలికలు తన జీవితంలో ప్రతిదినం, ప్రతి క్షణం ప్రజ్వలితం చేస్తారని ఆశించిన తను మానవ మస్తిష్కంలోని సహజ వక్రతను సరిగా గుర్తించలేకపోయాడు.

ఇప్పుడు అంచనాలు తప్పిపోయి, పగ పట్టి, పడగ విప్పి కాటేయడానికి సిద్ధమైన మిణ్ణాగులు పొంచి ఉన్నాయంటే ఎక్కడో తను పప్పులో కాలేశాడన్న మాట.

శ్రీధరబాబు ఆలోచనల ఉప్పెన పైన అసహాయంగా కొట్టుకుపోతున్నాడు. అసలు జ్యోతి అంటే తన కంత అభిమానం ఎందుకు? ఆవు పొదుగు తన్నుతూ పాలు కుడిచే లేగను చూస్తుంటే తనకు బ్రహ్మానందం కలుగుతుంది. రోడ్డు పక్క చెట్టు కింద గుడ్డి తల్లికి ఎక్కడెక్కడో అడుక్కొని తెచ్చిన పిడికెడు మెతుకులు కలిపి స్వయంగా తినిపిస్తున్న చింకి తల పిల్లని తనివితీరా నుదురు చుంబించాలని తన కనిపించిన మాట వాస్తవం. అమాయకులన్నా, అసహాయులన్నా తన మనసు కరుగుతుంది. అయితే, లోకంలో ఆర్ద్రతలకి అర్థాలు వేరు.

జ్యోతి మీద అభిమానం తనకు ఏదో వెనక జన్మ వాసనలా తోస్తుంది. ఆమె కనిపిస్తేనే కడుపు నిండినట్లనిపిస్తుంది. ఆమె తల్లిదండ్రులెవరో? ఏ కాలుజారిన శీలం ఈ లోకంలోకి చేర్చిందో ఆమెని? కానీ, ఆమె సభ్యత, సంస్కారం అతనికే ఆశ్చర్యం కలిగిస్తున్నాయి.

ఒక రోజు సంగతి — పాఠశాల వేళ మించింది. గంగిరావి చెట్టు కింద నిలుచుని ఆలస్యంగా వస్తున్న విద్యార్థులను చీవాట్లు పెడుతున్నాడు తను.

తల వంచుకుని అందరికన్నా ఆలస్యంగా వస్తోంది జ్యోతి. ముడుచుకొని నడుస్తున్నట్టుంది.

శ్రీధరబాబుకు కోపం ముంచుకొచ్చింది. ఆమెను దగ్గరగా రమ్మని పిలిచాడు. "ఎందు కింత ఆలస్యంగా వస్తున్నావు?" కటువుగా అడిగాడు.

ఆమె మౌనంగా నిలుచుంది. అతనికి కోపం మరీ రెచ్చిపోయింది. "టైమెంతో తెలుసా?" అడిగాడు మళ్ళీ.

"తెలుసండి! నేను చాలా ఆలస్యమయ్యాను. గుడ్డలన్నీ చినిగిపోయాయి. కొంచెం గట్టిగా ఉన్న ఒక జతతో నెట్టుకొస్తున్నాను. పొరపాటున సిరా ఒలికి అదీ పాడయింది. ఎలా రావాలో తోచక చివరికి బయలుదేరాను."

శ్రీధరబాబు ఆమెను పరిశీలనగా చూశాడు. జ్యోతి వేసుకొన్నవి చాలా పాతబడిన గుడ్డలు. అసలవి గుడ్డలనడం కన్నా చిరుగు బొంత అనడం సబబు.

"ఇలాటి పాత గుడ్డల్లో బడి కెలా వచ్చావు?" ఇంకా గొంతులో కరుకు పోలేదు.

జ్యోతి కళ్ళలో నీళ్ళు నిలిచాయి. దీనంగా అతనివైపో క్షణం చూసి తల దించుకుంది.

"హాస్టల్ వాళ్ళు కొత్త బట్టలు ఇవ్వలేదా?" అడిగాడు.

"గ్రాంటు తగ్గిందని ..."

"ఏమైనా నీ కిప్పుడు శిక్ష పడవలసిందే." దృఢంగా అన్నాడతను.

ఆమె బెదిరిపోయింది. బెంచీల మీద నిలుచున్న పిల్లలు గుర్తొచ్చారు. ఈ మాస్టారు క్రమశిక్షణలో ఎంత కఠినంగా ఉంటాడో ఆమెకు తెలుసు.

శ్రీధరబాబు తన కార్యాలయంలోకి వెళ్ళాడు. జ్యోతి వరండాలో నిలుచుంది. బల్లపైన ఉన్న పిలుపు గంట నొక్కాడతను. జవాను రాగానే బల్ల సొరుగు నుంచి కొంత డబ్బు తీసి ఇచ్చాడు.

"రహీం! ఈ అమ్మాయిని దగ్గర్లో ఉన్న చేనేత వస్త్రాలయం పిలుచుకెళ్ళు. ఓ జత బట్టలు కొని దర్జీ కిచ్చి పంపించెయ్యి."

"నాకేం వద్దండి. నన్ను మన్నించండి." గద్గదికంగా అని తల దించుకొంది జ్యోతి.

"ఏం ఫరవాలేదమ్మా, నువ్వు తల వంచితే నేను తల వంచినట్టే. నా విద్యార్థుల మాన మర్యాదలు నాకు చేతనైనంతవరకు రక్షించడం కూడా నా బాధ్యతే."

కృతజ్ఞత నిండిన చూపులతో అతణ్ణి చూసింది జ్యోతి. "దేవుడు దయతలిస్తే ఎలాగైనా మీ ఋణం తీర్చుకోను, మాస్టారూ!" అంది మెల్లగా. అతను ఆ మాటలకు నిరుత్తరుడై పోయాడు.

జ్యోతి తరవాత ఎన్ని విధాలుగానో అతనికి ఋణపడుతూనే ఉంది. హిందీ ప్రచారక పరీక్ష ఫీజు లాంటి వాటి కతడు సాయపడ్డాడు. ఆరు నెలలుగా పెరిగిన పరిచయంతో జ్యోతి శ్రీధరబాబు ఇంటికి తరుచుగా వస్తూంది. చదువు విషయంలో ఆమె కున్న ఉత్సాహం కొన్నిసార్లు అతనికి చికాకు కలిగించినా, ఆ అభాగినికి అనుక్షణం అనుకూలంగానే ప్రవర్తించడం అలవరుచుకున్నాడు.

• • •

శ్రీధరబాబు ఒక్క ఊపుతో ఈ లోకంలోకి వచ్చాడు.

రిక్షా ఛైర్మన్ ఇంటిముందాగింది దిగా డతను. గేటు నెట్టుకొని లోప కెళ్ళాడు. సమావేశాల గదిలో కూర్చున్నాడు. చేతిలో ఉన్న చీటీ మళ్ళీ విప్పి చదివాడు. 'చాలా రోజులుగా ... చెప్పాలనుకున్న విషయం ...' చెప్పాలట!

ఏ విషయం అది? జ్యోతి విషయమే కాబోలు.

లోకం ఎంత గుడ్డిదో తెలిసి తెలిసీ తను పొరపడ్డాడు.

"ఏం మాస్టారూ ..." ఛైర్మన్ సుందరరావు పలకరింపులో వెక్కిరింత లేకపోలేదు. "అరే, ఈ చిన్న దీపం గుడ్డి వెలుగులో కూర్చున్నారు, ఆ పెట్రొమాక్స్ దీపం దివ్యంగా వేసుకోక?"

తన పరిధిలో తనూ ఓ చమత్కారినే అని గుర్తు చేస్తున్నట్లు అని గొట్టం దీపం మీట నొక్కాడాయన. గది అంతా వెలుగు వరదలో మునిగింది.

"లోకంలో పూచిక పుల్లని నమ్ముకొని పడవ తగలేసుకునే వాడుంటాడా, మాస్టారూ?" అంటూ కూర్చున్న సుందరరావుగారి వంగిన తలమీద నున్నటి తలంలో దీపం వెలుగు తళుక్కుమంది.

"అది సరే. ఇంతకీ మన స్కూలు వ్యవహారా లెలా ఉన్నాయి?" అడిగాడు ఛైర్మన్.

శ్రీధరబాబు తనెలాంటి ఊబిలో చిక్కుకున్నదీ అర్థం చేసుకొన్నాడు. అయినా, తన తెంపు కిందు కాకూడదు.

"నిర్వహణకర్తల చిత్తశుద్ధికి తగినట్టే పాఠశాల చక్కగా నడుస్తోంది" అన్నాడు జాగ్రత్తగా.

"అని అంటారా?" పిడుగు పడిన ట్టుంది ఛైర్మన్ గొంతు. "ఎంత చేదుగా ఉన్నా కొన్ని నిజాలు చెప్పక తప్పదు, శ్రీధరంగారూ! మీ వ్యవహారం మా పీకలకు తెస్తున్నది. మీరు మాత్రం నిశ్చింతగా ఉన్నారు. ఎవళ్ళకీ జవాబిచ్చుకో లేక మేం చస్తున్నాం. చూడండి, ఇవేమిటో! మీ ఘనతను గూర్చి ప్రశంసల పరంపర. ప్రతి వెధవా ఓ ఆకాశరామన్న అయి ఈ రాకాసి ఉత్తరాలు రాసే కాలం వచ్చింది మా పాలిటికి."

ఆయన తన మొగం మీద ఆడిస్తున్న ఉత్తరాలు అందుకోవడం తప్ప లేదు శ్రీధరబాబుకి. అందుకుంటూ మెల్లగా, దృఢంగా అన్నాడు: "ఇప్పుడు కలిగిన నష్టం ఏమీ లేదు. మీరు కంగారు పడకండి. నా కర్తవ్యం నాకూ తెలుసు." ఓ ఉత్తరం చూశాడు. అతని కనుబొమలు ముడిపడ్డాయి. తనంటే గిట్టని వాళ్ళు ఎవరో తెలివిగా చేస్తున్న ప్రచార వైఖరి కొంత అర్థమైంది. తల ఎత్తి సుందరరావు మొహంలోకి చూశా డతను.

"శ్రీధరంగారూ!" స్వరం తగ్గించి జాలిగా మొదలెట్టాడు ఛైర్మన్. "ఈ విషయం ఎంత దూరం పోయిందో చూడండి! మీకూ, దిక్కులేని ఆ పిల్లకీ ఏం చుట్టరికం, చెప్పండి? చీరలూ సారెలూ ఇవ్వడానికి ఆవిడే దొరికిందా? మన కెంత ఇష్టమైనా లోకం ఏమను కుంటుందో గమనించాలి. మీ ఇద్దర్నీ కలిపి ఇలా అంటరా అనేదాకా, ఇలా మాకు జాబులు వచ్చేదాకా ఎందుకు సాగనిచ్చారో చెప్పండి?" కాఠిన్యం పోత పోసుకుంది ఆయన గొంతు.

మెత్తటి కుషన్ మీద కూర్చున్నా, ముళ్ళమీద ఉన్నట్టుంది శ్రీధరబాబుకి.

"ప్రధానోపాధ్యాయులే ఇలాటి డొంక తిరుగుడు వ్యవహారాల్లో తల దూరిస్తే మా పాఠశాలలో ఇక మతి ఉన్న ఏ తండ్రి తన కన్నకూతుర్ని చేరుస్తాడు? చెప్పండి మీరు — మరికి నష్టం అంతా?"

ఒక్కొక్క మాట శ్రీధరబాబు మనసుపైన సమ్మెట పెట్టులా దెబ్బ తీస్తూంది. 'ఉదాత్త గుణాలు వెదికిన ఫలితం — కష్టానికి కరిగే గుండె ఉన్నందుకు బహుమతి ఇది.' బాధ కలిగింది.

ఛైర్మన్‌కూడా ఇలా అనటం అసహ్యంగా ఉంది. ఏదో ఎవరో అంటే నెకిలి వాళ్ళని లెక్కపెట్టడు తను. అన్నీ తెలిసిన పెద్దమనిషి ఇంత తొందరగా అపార్థం చేసుకొంటే తన కింక ఇక్కడ స్థానం ఉంటుందా? అహోరాత్రాలు శ్రమించి తాను వీళ్ళ దగ్గర సంపాదించుకొన్న విశ్వాసం రజ్జువులు ఎంత పురి లేనివి? శ్రీధరబాబు ఆత్మ విమర్శలో పడ్డాడు. ఈ ఛైర్మన్ గుణగ్రాహి కాకపోలేదు. నిజానికి ఎక్కడో మామూలు ఉపాధ్యాయుడుగా ఉన్న తనని దైవ ఘటనగా చూచి, విద్యార్థుల మనస్సులో తన కున్న స్థానం గుర్తించి, తన ఆశయాలు, సామర్థ్యం విశ్వసించి నిస్సంకోచంగా ఇంత పాఠశాలనీ తన చేతుల్లో ఉంచిన దీయనే. ఆయన నమ్మకం సడలిం దంటే తన పొరపాటు కూడా ఉండాలి. రెండు చేతులు కలిస్తే కాని చప్పట్లు కావు.

చివరికి శ్రీధరబాబు సానునయంగా, సవినయంగా అన్నాడు: "నన్నొక్క విషయం చెప్పనివ్వండి. నేను ఈ పాఠశాల అధికారిగా ఉండటానికి మీ ఆదరమే కారణం. అది చెదిరిపోయిన మరుక్షణం నే నిక్కడ ఉండలేను. అవిశ్వాస స్థానంలో అంటిపెట్టుకొని ఉండటం నా మతం కాదు. కానీ, ఒక్క జ్యోతి కారణంగా ఇంత జరగటమే బాధ. ఆమె కేవలం మన పాఠశాల విద్యార్థిని. నిరాధారంగా మన పాఠశాలను నమ్ముకొని తన భవిష్యత్తంతా ఇక్కడే నిర్మించుకొంటోంది. ఆమె వినయ విధేయతలు, పేదరికం ప్రత్యేక ఆదరం కలిగించిన మాట నిజం. కాని, ఎప్పటికీ ఆమె విద్యార్థినే. నేను నేనే. మరో భావానికి ఇక్కడ సూది మొనంత తావు లేదు. మీరూ ఇదే దృష్టితో చూడవలసిన పెద్దలు ..." ఆగాడు శ్రీధరబాబు.

"కానీ, దేనికైనా హద్దు లుంటాయి, బాబూ!"

"అయితే మీరూ నన్ను అనుమానిస్తున్నారు. ఏ ఆలోచనైనా అనుమానంతోనే ప్రారంభమవుతుందన్న మాట నడవారణాల సత్యం. కానీ, ఎవరో ఏదో అనడమే అనుమానానికి కారణం కారాదు. అది ఏ కాల్పనిక కథల్లోనో సరిపోతుంది. జ్యోతిని నేను ఇంతవరకూ ఏ దురు



ద్దేశం లేనూ చూడలేదు. ఇక్కడ నిప్పు లేనిదే పొగ లేదన్న న్యాయం పాటింపు కాదు. నిజానికి ఇంతకూ ఇక్కడ నిప్పు లేదు. పొగ ఎలా వచ్చిందో తెలియడం లేదు. అది శోధించి నన్ను రక్షించవలసిన వారు మీరు. దిక్కులేనివాడే జాలితో నే నామెకు చిన్న సహాయాలు చేసి ఉండవచ్చు. అలా ఎందరికో చేశాను. నా ఇంటికి జ్యోతి ఒక్కర్తే కాదు వచ్చేది. నిత్యమూ వచ్చే పంద మందిలో ఆమె ఒకతె. సత్యం ఇంత స్పష్టంగా ఉంది తరవాత మీ ఇష్టం.'' శ్రీధరబాబు మొహం అయిదు వేళ్ళతోను నొక్కుకున్నాడు ఎగిరి పడుతున్న కణతలను అణుచుకుంటూ.

''మీ రలా అరటి పండు వలిచిన నైఖరిలో చెబుతారు. వాళ్ళేమో ఆ పండు ముక్కలు చేసి చక్కెర్లో పొర్లించి నోటికి అందించినట్లు చెపుతారు. ఫలానా తేదీని ఆ పిల్ల మీ ఇంట్లో ఉందనీ, ఫలానా గదిలో ఫలానా అన్ని నిమిషాలుందనీ, ఆ తేదీని హాస్టల్లో అంతు లేదనీ, ఈ రోజున ఈ చీరో ఆ పాలో మీరు కొనిచ్చారనీ ఇలా తేదీలతో, గంటలతో కూడా చిత్రగుప్తుణ్ణే తలదన్ని రాస్తారు. మధ్య మాకు చచ్చే చావు వచ్చి పడింది.'' ఆగాడు సుందరరావు. ''నెల రోజుల క్రిందట ఆవిడ ఆస్పత్రిలో మూడు రోజు లుందనీ, అది మీ ఇద్దరి సుఖ ఫలాన్ని సులభంగా తొలగించుకోవడానికే అనీ వాళ్ళంటున్నారు. మీరేమో సద్బుద్ధితో, జాలితో సాయం చేశానంటారు. జాలితో చేశారో, 'జాలీ'గా చేస్తారో గానీ మధ్య మేం ఏం చెయ్యాలో తెలియ జెప్పండి.'' నొక్కవలసిన చోట నొక్కుతూ, తేల్చవలసిన చోట తేలుస్తూ కనుబొమ లెగరేస్తూ, మహా వక్తలా ఉపన్యసిస్తున్న సుందరరావును చూస్తుంటే శ్రీధరబాబుకి మతి పోతున్నట్లుంది. ఇక ఆగలేకపోయాడు.

''మీరు నా మనస్సునూ, ఆత్మనూ నాశనం చేస్తున్నారు. సంకుచితత్వం నే నింకా నేర్చుకోవలసిన గొప్పగుణం. ఒక్క మాట నిజం. మన పాఠశాలకు నే నెలాటి అవమానం రానివ్వను.''

''అలాగే అనుకున్నాం ఇంతదాకా. ఇప్పుడు ఇలా తగలడింది. ఇప్పుడు మేమేం చెయ్యాలో చెప్పండి. మీరు చెప్పిందే చేస్తాం.''

ఛెయిర్మన్ మాటల కేం జవాబివ్వాలో తెలియలేదు శ్రీధరబాబుకి. తన నెక్కడికి లాగుతున్నాడో అర్థం కాలేదు.

''సన్నాయి నొక్కులెందుకు లెండి! నేను ఎన్నిమార్లు చెప్పినా ఒక్కటే. ఆమెకూ, నాకూ ప్రత్యేక సంబంధం ఏమీ లేదు. ఆమె కూడా ఇలాగే భావిస్తుందను కుంటా. మీకు ఎలా తోస్తే అలా చెయ్యండి.''

సుందరరావు లేచి కిటికీ వైపు నడిచాడు. వెలుపలికి చూస్తూ అన్నాడు: ''శ్రీధరంగారూ! ఈ చిక్కులోంచి బయట పడటానికి మీకు ఇష్టమేనా? ఐతే ఒక్కటే ఉపాయం తోస్తోంది. మీ రది చెయ్యండి. తప్పదు. కొన్నాళ్ళ కెలాగో ఈ విషయం సద్దుమణిగి పోతుంది.'' మనసులో ఏదో తూస్తున్నట్లు ఆగాడాయన.

''ఏమిటి మీ రంటున్నది?'' శ్రీధరబాబు అనుమానంగా అడిగాడు.

సుందరరావు తిరిగి వచ్చి కూర్చుని అతని మొహంమీద చూపు నిలిపి అన్నాడు:

''అవును. జ్యోతిని పాఠశాలనుంచి పంపివేద్దాం. రెండు మూడు నెలల్లో అంతా మరిచిపోతారు. ఇంతకీ మీవంటి సమర్థులను పోగొట్టుకోలేక ఈ తేలిక దారి చూపుతున్నాను. లేకుంటే ...'' ఆయన మరేమీ అనలేదు.

శ్రీధరబాబు అదిరిపోయాడు. అనుకోని చిక్కు ఎదురైంది. ''ఇది న్యాయం కాదు. ఆమె పరీక్షల్లో జిల్లాలో ప్రథమంగా వస్తుంది. ఆమె అనాథ జీవితం దీనితో ఓ దారిన పడుతుంది. ఆత్మ గౌరవంతో తలఎత్తుకు తిరుగుతుంది. మనం పంపివేస్తే ఆమె జీవితం నాశనం అవుతుంది. చేయని నేరానికి ఆ అమాయకురాల్ని శిక్షించకండి. ఒకర్ని తృప్తి పరచడానికి మరొకర్ని బలిచేయడం ఏం న్యాయం?'' అన్నాడు విచారంతో క్రుంగిపోతూ.

ఛెయిర్మన్ కుర్చీ కిర్రుమంది. అటూ, ఇటూ ప్రదక్షిణంలా చేశాడు. ''మరే ఉపాయం లేదు. మన ఇష్టా యిష్టాలెట్లున్నా ఇతరుల దృష్టిని గమనించాలి. శీలం అంటే మీలో ఉండేది కాదు, మాస్టారూ! మీ గురించి ఇతర్ల దృష్టిలో మిగిలేది! జ్యోతిని ఈ రోజే పంపి వెయ్యండి.'' ఆయన గొంతులో నిశ్చయం ధ్వనించింది.

''తర్వాత ఏమవుతుంది? ఆలోచించండి.''

''గంగలో దూకుతుంది. మీకెందుకండీ! మన మెక్కడ దూకాలో మనం ఆలోచించండి. ఏమవుతుంది? ఎవణ్ణో కట్టుకుంటుంది. సంసారం చేసుకుంటుంది చక్కగా.'' తేలిగ్గా అన్నాడు సుందరరావు. అంటూ లేచి ఇంట్లోకెళ్ళాడు.

శ్రీధరబాబు ఒక్కడే ఆ విలువైన వస్తు సంభారంతో నిండిన చక్కని గదిలో ఒక క్షణం మంచుగడ్డలా జడత్వం పొంది తేరుకున్నాడు. పరిపరి ఆలోచనల వరదలో కొట్టుకుపోయాడు. ఎక్కడా ఒడ్డు తగలడం లేదు. జ్యోతిని పంపడం జరిగితే ఆమె ఈ నాటి పెళ్ళికొడుకుల హిరణ్యాక్ష వరాలు తీర్చ యోగ్యుడైన భర్తను పొందగలదా? అసలు కులం, గోత్రం తెలియని అనాథను ఎవరు చేసుకుంటారు? గోడమీద వ్రాతలా ఒక్క విషయం స్పష్టంగా తోస్తోంది అతనికి. పాఠశాల వదలిన మరుక్షణం జ్యోతి నడివీథిలో ఒంటరిదై పోతుంది. హాస్టల్లోనూ ఉండనివ్వరు. ఆమె సభ్యత, సంస్కారం, తెలివితేటలు, కళాకౌశలం అన్నీ వ్యర్థమై పోతాయి. ఆమె కుక్కలు చింపిన విస్తరవుతుంది.

శ్రీధరబాబు ఇక ఆలోచించలేకపోయాడు. తనామెతో చనువుగా ఉండటమే ఆమెకీ దుర్గతి తెస్తున్న దన్నభావం అతని గుండె మండిస్తోంది. దీనికి తనే పరిష్కారం వెదకాలి. మనిషిగా తన కనీస బాధ్యత అది.

జ్యోతి! పాపం ఎంత అమాయకురాలు!

నెల రోజుల క్రితం ... రెండువారాలుగా తను తీవ్ర జ్వరంతో బాధపడ్డాడు. మూడో రోజు కూడా జ్వరం దిగలేదు. ఇంట్లో ఉండిపోయాడు. సత్యంగా జావ కూడా కాచుకోలేకపోయాడు. పాఠశాల జవానులకు ఇంటి దగ్గర పని చెప్పే అలవాటు లేదు తనకి. సాయంత్రానికి సీరసం పెరిగి మూలుగుతూ పడుకొన్నాడు. వేడితో పగిలిపోతున్న కణతల మీద ఎవరో సన్నటి వేళ్ళతో మృదువుగా రుద్దటంతో అతనికి స్పృహ వచ్చినట్లయింది.

''జ్యోతీ! ఇలా వచ్చావేం?'' అన్నాడు మెల్లిగా ఓపిక తెచ్చుకుని.

''మీరు చెప్పి పంపకపోయినా వచ్చాను.'' నిష్ఠూరంగా అందామె.

''నీ కెందుకీ శ్రమ! ప్రతి నిమిషం జాగ్రత్తగా చదువుకోవలసినదానివి.''

''పర్లేదండి. ఇంత అనారోగ్యంగా ఉండీ నే నొక క్షణం చూడ్డానికి రావడం కూడా తప్పేం కాదు. చదువు బాగానే సాగుతోంది. ఇంతకీ ఎవరికైనా బంధువులకు చెప్పి పంపక పోయారా?'' నొచ్చుకుంటూ అం దామె.

శ్రీధరబాబు పెదవి విరిచాడు. ''నా కోసం బాధపడే బంధువు లెవరున్నారు?''

జ్యోతి మొహం పక్కకు తిప్పుకుని కొంగుతో కళ్ళు తుడుచుకోవడం అతను గమనించాడు. మనసు చివుక్కుమంది.

ఆమె కొంచెం కోపం తెచ్చిపెట్టుకొని, ''మా కవసరం వచ్చినా మీరు మా కాత్మబంధువులు. మరి మీ ఇబ్బందులలో మేమంతా పరాయివాళ్ళమే. మీ దెంత పక్షపాత బుద్ధి, మాస్టారు గారూ! నిజం చెప్పండి. మీకూ మాకూ ఏ సంబంధం లేదంటారా?'' అని మాటగా అడిగిం దామె.

శ్రీధరబాబు బదులు చెప్పలేకపోయాడు. జ్యోతి నిర్మల హృదయం అంత అనారోగ్యంలో ఉన్న అతనికి నెమ్మది కలిగించింది. ఆమె పట్టుపట్టి అతన్ని నర్సింగ్‌హోమ్‌లో చేర్పించి జ్వరం నిమ్మళించేదాకా కంటికి రెప్పలా కాచింది.

అలాటి జ్యోతికి తను చేసే ఉపకారం ఇదన్న మాట— ఉన్న కాస్త ఆధారం పోగొట్టి అనిసితపాలు చేయడం!

ఛెయిర్మన్ సుందరరావు ఎప్పుడు తిరిగి వచ్చాడో శ్రీధరబాబు గమనించలేదు. చివరి కన్నాడు: ''నా కో గంట వ్యవధి ఇవ్వండి. ఆలోచించి వచ్చి చెపుతాను.''

• •

పార్కులో ఓ మూల పచ్చిక మేటల మీద శరీరాన్ని పడవేసి తీవ్రంగా ఆలోచిస్తున్నాడు శ్రీధరబాబు. క్షణక్షణం ఆలోచన చెదిరిపోతూంది; తల తిరిగిపోతూంది.

**విమర్శ**

సాహిత్య విమర్శకులను చూస్తే నాకు అనిపిస్తుంది మోతలు పెడుతూ, వేగంగా వెళ్ళిపోతున్న రైలును ఆగి పొమ్మని విజిల్ ఊదడం లాంటిదని.

—క్రిష్టఫర్ మార్లో

'ఇప్పుడేం చేయాలి?' అని తనని తానే ప్రశ్నించుకున్నాడు. ఏ దేలా గున్నా జ్యోతిని పాఠశాల నుంచి పంపటం జరగదు. తనూ, ఆమే ఇక్కడే ఉండటం ఛైయిర్మన్‌కు ఇష్టం కాదు.

అతని దృష్టిలో ఒకే ఉపాయం తోచింది. జ్యోతిలా నిస్సహాయుడు కాదు తను. తనకు ఈ పాఠశాల కాకుంటే మరొకటి దొరుకుతుంది. తను వెళితే జ్యోతి చదువు సాఫీగా సాగుతుంది. కాని, తను ఈ పాఠశాలనూ, ఈ వెయ్యి మంది విద్యార్థుల్నీ వదిలి దూరంగా వెళ్ళాలి. తను వెళ్ళగానే స్కూలు మళ్ళీ మొదటికి వస్తుంది. ఇన్నాళ్ళుగా తను నిర్మించిన ఊహా సౌధం కూలిపోతుంది. పైగా తను లేకుంటే జ్యోతిని వేధించే శత్రువులు మితిమీరిపోతారు.

ముడి విప్పబోతే బిగిసిపోతూంది. తను పాఠశాల వదలకుండా, జ్యోతికి దుస్థితి రాకుండా పరిష్కారమార్గం ఏమిటి?

ఆలోచనల్లో నలుగుతున్న అతనికి మెరుపు మెరిసినట్లయింది. 'ఆశయం లేని ఆమెకు ఆశయం కల్పించాలి.' ఓ కమనీయమైన ఆశయాల కలవాటుపడిన అతని కా ఆలోచన నచ్చలేదు. దూరంగా నెట్టివేశాడు.

మళ్ళీ మొదలు. తనేం చెయ్యాలి? ఆ ఉపాయమే సాధ్యంగా కనిపిస్తోంది. ఈ సారి కొంత నింపాదిగా ఆలోచించాడు.

దూరంగా చర్చి గోపురం పైన గంట మృదుస్వరంతో ఎనిమిది సార్లు మోగింది.

'అవును. అదొక్కటే ఉపాయం!' పొంగిపోయింది అతని మనసు.

'జ్యోతికి ఆశయం ఇస్తాను. ఆమె విద్యార్థినీ, నేను ప్రధానోపాధ్యాయుణ్నీ అయితే మా ఇద్దరి సాన్నిహిత్యం లోకం దృష్టిలో చెడుగా నిలిచింది. జ్యోతిని నా దాన్ని చేసుకుంటాను, ఒంటరిగా ఉండి పోవాలన్న నా కోరిక చంపుకుంటూ. జ్యోతి రత్నం లాంటిది. దిక్కులేనిదైనా, కులం, గోత్రం తెలియకపోయినా ఆమె గుణం కల పిల్ల. నా కంతే చాలు. జ్యోతిని నా జీవిత సహచారిణిగా చేసుకొంటాను.' ఈ కొత్త ఆలోచనతో అతని మనసు ప్రశాంత మాధుర్యం చవిచూసింది.

శ్రీధరబాబు ఛైయిర్మన్ ఇంటికే చకచకా నడిచాడు.

"ఏమని నిర్ణయించారు? జ్యోతిని పంపించేస్తారు కదూ?" ఆత్రంగా అడిగాడు ఛైయిర్మన్.

తను ఆలోచించి చేసిన నిర్ణయం చెప్పాడు శ్రీధరబాబు



శైశవం
ఫోటో— ఎస్. శ్రీనివాసరావు (హైదరాబాదు)

ఛయిర్మన్ గంభీరంగా ఉండిపోయాడు ఆలోచనల్లో. తరవాత తల అడ్డంగా ఊపాడు. "లాభం లేదండీ, మాస్టారూ" అని నవ్వాడు. "మీరు మరీ ఊహాలోకాల్లో ఉయ్యాల లూగుతున్నారు. మన పాఠశాల కమిటీలో ఉన్న దెవరో మరిచిపోయారు మీరు. కులం, గోత్రం లేని దాన్ని పెళ్ళిచేసుకోవడం గుడ్డి ప్రేమ అంటారు. అలాటి ప్రేమికుడు నీతిగా విద్యార్థులను దిద్దలేడంటారు. అసలే వ్యతిరేకులు వేస్తున్న విద్యార్థుల బుర్రలు తను గురువునే అనుసరించవని నమ్మకం ఏమిటి? అంటారు. అయ్యా, మీకో మాట చెబుతున్నా. ఇంతటితో ఈ ప్రసంగానికి స్వస్తి చెప్పి జ్యోతిని పంపివేయడం తప్పదు మీకు."

"నేను పాఠశాలను వదలి వెళతాను మీరు జ్యోతి చదువు సాగించడానికి ఏమీ అభ్యంతరం చెప్పమని హామీ ఇవ్వండి." చివరి మాటగా అడిగాడు శ్రీధరబాబు.

"అబ్బెబ్బే! అదెలా సాధ్యం? ఇంత మంచి మాస్టారునే వల్లో వేసుకున్న ఆమె లాటి నీతిలేని వాళ్ళకు మా పాఠశాలలో చోటుండదు." నిర్దయగా అన్నాడు ఛైయిర్మన్.

శ్రీధరబాబు సహనం పూర్తిగా నశించింది. ఇక ఉండబట్టలేకపోయాడు. కోపంతో వణుకుతూ, "మీరూ మీ పాఠశాలా మడిగట్టుకు ఉండండి. నా కర్తవ్యం ఏదో నా కుంది. జ్యోతి నిలా నడి దారిలో వదలడం నాకు చేతకాదు. ఆమెకు ఆశయం ఇవ్వడమే నేను చేయగల సహాయం. దానికోసం మీ పాఠశాల వదలవలసి వస్తే సంతోషంగా వదిలేస్తాను. నాకోసం ఆమెను సర్వనాశనం కానివ్వను" అన్నాడు. వెంటనే జేబులోంచి ఓ తెల్లకాగితం పైకి తీశాడు. రాజీనామా లేఖ వ్రాసి తన ముందున్న బల్లమీద పెట్టి వెళ్ళిపోయాడు.

* * *

తేలికపడిన మనసుతో ఇంటివైపు నడిచాడు శ్రీధరబాబు. తనకు ఉద్యోగం సమస్య కాదు. జ్యోతి భార్యగా దొరకటం ఎప్పుడూ ఎదురయ్యే అదృష్టం కాదు. ఆమెతో పెనవేసుకున్న జీవితంలో లోటు ఉండదు. ఇన్నాళ్ళుగా జ్యోతికి సంఘంలో స్థానం పెంచే ఈ కార్యం గూర్చి తను ఆలోచించకపోవడం ఆశ్చర్యంగా ఉంది అతనికి.

ఇల్లు చేరాడు ఆలోచనల వేగంతో వీధి గేటు తీసి ఉంది. ఎవరు వచ్చి ఉంటారో అనుకొని నడక వేగం తగ్గించి మెల్లగా గేటు దాటాడు. లోపల ఇంటి ముందు వరండాలో ఉన్న బెంచీమీద ఎవరో కూర్చుని ఉన్నట్టు గమనించాడు. ఓ స్త్రీ కంఠంతోబాటు పురుషకంఠం వినిపించడంతో ఆశ్చర్యపడి నిలిచి పోయాడు.

"జ్యోతీ!" మగ గొంతు మెల్లగా అంది. "శ్రీధరబాబుగారు ఏమీ అనరు కదా. మన గొడవలన్నీ ఆయన కెందుకు, పాపం? అనవసరంగా వారిని బాధపెడుతున్నావు?"

తన పేరు వినబడటంతో జాగ్రత్తగా విన్నాడు శ్రీధరబాబు.

"అదేమిటి, మధూ! వారి అంగీకారం లేందే నే నేం చెయ్యగలను?"

ఆ గౌరవభావానికి ముగ్ధుడయ్యాడు శ్రీధరబాబు.

"కొంపదీసి ఆయన పెళ్ళికి ఒప్పుకోక పోతే?"

"వద్దంటే ఇలాగే ఒంటరిగా ఉండిపోతాను." జవాబిచ్చింది ఆడ గొంతు.

పులకరించి పోయాడు శ్రీధరబాబు

"అంటే, నన్ను వెళ్ళగొట్టడానికి సిద్ధంగా ఉన్నావన్న మాట!" చిలిపిగా వినిపించింది మగ గొంతు.

"ఆఁ నిజంగానే?" మరింత చిలిపిగా అంది ఆడగొంతు. "పిచ్చి మధూ! వెళ్ళగొట్టడానికేనా నిన్ను వెతికి పట్టుకొన్నది? నీవు ఇప్పుడు అందించిన ఈ చేయి సముద్రంలో తుఫాను మధ్య చిక్కుకున్న నన్ను తీరం చేరుస్తున్న పడవ లాటిది. మన మాస్టారు నేను కోరుకున్న వాణ్ణే పెళ్ళాడి ఇల్లాలినై సుఖంగా ఉంటే ఎంతో సంతోషిస్తారు. ఆయన నాకు దేవుడిచ్చిన తోబుట్టువు, మధూ!" జ్యోతి మాటలు తియ్యగా వినిపించాయి.

ఆ మాధుర్యం వెనక చేదు. చేదా. కాదనుకున్నాడు శ్రీధరబాబు. తమ బంధానికి తనే సరిగా విలువ కట్టలేకపోయాడు జ్యోతి హృదయం విప్పి చక్కగా చెప్పింది 'నన్ను ముంచివేసిన సమస్యకు నీవే పరిష్కారం వెతికావా, జ్యోతీ!' మనసులోనే కృతజ్ఞతలు తెలిపాడు. ఆమె తన ఇల్లాలుగా కంటె ఇలా చెల్లెలుగా మరింత తగినదే.

బరువుగా అడుగులేస్తూ లోపలికి నడిచాడు శ్రీధరబాబు. ★